ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సునీత

బీఆర్ఎస్ యువజన విభాగం పట్టణాధ్యక్షుడు హైమద్ కుటుంబానికి రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే సునీతామహేందర్‌రెడ్డి

ఆత్మకూరు(ఎం), మార్చి 28 : రంజాన్ మాసం పురస్కరించుకొని మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ యువజన విభాగం పట్టణాధ్యక్షుడు ఎండీ హైమద్ శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

నషా ముక్త్‌భారత్‌పై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి కలెక్టరేట్, మార్చి 28 : మత్తు పదార్థాల బారిన యువత, పిల్లలు పడకుండా గ్రామాల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మహిళా, శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన నషా ముక్త్ భారత్ (మిషన్ పరివర్తన) జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన యువకులు, పిల్లలను వాటి నుంచి రక్షించేందుకు రీహాబిటేషన్ కేంద్రాలకు తరలించి మెరుగైన సేవలు అందించాలన్నారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో జడ్పీ సీఈఓ శోభారాణి, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, డీఎంహెచ్‌ఓ మనోహర్, డీఈఓ సత్యనారాయణ, అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ, ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ, సీడీపీఓ జ్యోత్స్న, జిల్లా లీగల్ సెల్ అథారిటీ శంకర్, ప్రకాశ్‌రెడ్డి, సంక్షేమ కార్యాలయ సూపరింటెండెంట్ శశికళ, యశోద, మిషన్ పరివర్తన కో ఆర్డినేటర్ శ్రవణ్, మంజుల, సుమ, న్యూ హోప్ ఎన్‌జీఓ కోమలి, సార్ప్ ఎన్‌జీఓ ప్రమీల పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు తలెత్తకుండా చూడాలి

- జడ్పీ సీఈఓ శోభారాణి

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ శోభారాణి

భువనగిరి కలెక్టరేట్, మార్చి 28 : గ్రామాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సమగ్ర చర్యలు చేపట్టాలని జడ్పీ సీఈఓ శోభారాణి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలన్నారు. గ్రామాల్లో వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం కార్యాలయంలోని రికార్డు గదిని, రిజిష్టర్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

సమావేశంలో ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాస్‌రావు, ఎంపీఓ ఎం.దినర్‌గౌడ్, వివిధ శాఖల అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తన ఎంచుకోవాలి : ఏసీపీ రాహుల్‌రెడ్డి

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ రాహుల్‌రెడ్డి

భువనగిరి అర్బన్, మార్చి 28 : అక్రమ కార్యకలాపాలను మానుకుని మంచి మార్గాన్ని ఎంచుకోవాలని ఏసీపీ కంకణాల రాహుల్‌రెడ్డి సూచించారు. భువనగిరి డివిజన్‌లో 78 మంది యాక్టివ్ రౌడీషీటర్లు ఉండగా.. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం 53 మందికి మంచి ప్రవర్తన కనబరిచే విధంగా ఉండాలని కౌన్సెలింగ్ చేశారు. నేర జీవితాన్ని వదిలిపెట్టి సంస్కారంతో జీవనం సాగిస్తే పోలీసుల సహకారం ఉంటుందన్నారు. రంజాన్ పండుగకు, స్థానిక సంస్థల ఎన్నికల్లో అక్రమ కార్యకలాపాలకు తావిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు అవసరమైతే పీడీ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. రౌడీషీటర్లు, డ్రగ్ పెడ్లర్లు, అనుమానిత వ్యక్తులపై కఠిన నిఘా పెట్టాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు సూచించారు. మంచి ప్రవర్తన కనబరిచిన వారిపై రౌడీషీట్ తొలగిస్తామన్నారు. అనంతరం డివిజన్‌లోని రౌడీషీటర్ల గత రికార్డులను సమీక్షించి వారి ప్రవర్తనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో భువనగిరి పట్టణ, రూరల్ సీఐలు ఎన్.చంద్రబాబు, కె.సురేశ్‌కుమార్, రూరల్ ఎస్‌హెచ్‌ఓ వి.సంతోష్‌కుమార్, బీబీనగర్ ఎస్‌హెచ్‌ఓ ఎం.ప్రభాకర్‌రెడ్డి, బొమ్మలరామారం ఎస్‌హెచ్‌ఓ బి.శ్రీశైలం, పట్టణ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగులు బాధ్యతాయుతంగా పనిచేయాలి

- తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి

ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న లచ్చిరెడ్డి

యాదాద్రి భువనగిరి, మార్చి 28 (నమస్తే తెలంగాణ) : భూ సమస్యలు లేని రాష్ట్రంగా తెలంగాణను మార్చేందుకు రెవెన్యూ ఉద్యోగులు పునరంకితం కావాలని తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి అన్నారు. రాష్ట్రంలో లబ్ధిదారులకు సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందించేందుకు రెవెన్యూ ఉద్యోగులు బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బాణాల రాంరెడ్డి అధ్యక్షతన జరిగిన ఉమ్మడి నల్లగొండ జిల్లా రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మళన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒకరు చొప్పున గ్రామ పరిపాలన అధికారుల నియామకంతో రైతులకు రెవెన్యూ సేవలు చేరువ కావడంతోపాటు ఉద్యోగులకు పెద్ద ఎత్తున పదోన్నతులు లభిస్తున్నాయన్నారు. దాంతో క్రమంగా రెవెన్యూ వ్యవస్థ బలోపేతం అవుతుందని తెలిపారు. 670 మంది ఫీల్డ్ అండ్ టెక్నికల్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రైవేట్ యాజమాన్యం నుంచి ప్రభుత్వ కార్పొరేషన్‌కు బదిలీ చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నామన్నారు. 61 సంవత్సరాలు పైబడిన వీఆర్ఏలను సర్దుబాటు చేసి ఆ కుటుంబాలకు న్యాయం చేసేలా, కారుణ్య నియామకాలు చేపట్టేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని చెప్పారు. సమావేశంలో తెలంగాణ ఉద్యకారుడు ఏపూరి సోమన్న ఆటాపాట అలరించాయి. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, కోశాధికారి వెంకట్‌రెడ్డి, టీజీటీఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాములు, రమేశ్, టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర కార్యదర్శి వి.భిక్షం, కోశాధికారి మల్లేశం, పూర్వపు వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరిక ఉపేందర్‌రావు, భువనగిరి, చౌటుప్పల్ ఆర్డీఓలు కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, ఎస్డీసీ డిప్యూటీ కలెక్టర్ జగన్నాథం, రవికుమార్, హరికిషన్ పాల్గొన్నారు.

'తెలంగాణ ఉద్యమకారులు మరో ఉద్యమానికి సిద్ధం కావాలి'

వలిగొండ, మార్చి 28 : తెలంగాణ ఉద్యమకారులు మరో ఉద్యమానికి సిద్ధం కావాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం టీయూ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగిశెట్టి క్రిస్టోఫర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో టీయూ జేఏసీ ముఖ్య నాయకులతో కలిసి శుక్రవారం ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ఉద్యమకారులను జూన్ 2లోపు గుర్తించి సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 20, 21 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించే టీయూ జేఏసీ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పబ్బు లక్ష్మయ్య, గంగదారి సత్తయ్య, మంటి లింగం, గంధమల్ల గోపాల్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కేవీ వైపే కార్మికుల మొగ్గు

- నేడు పెద్దకందుకూరు పీఈఎల్ యూనియన్ గుర్తింపు ఎన్నికలు
- 390 మంది కార్మికులకు గానూ మెజార్టీ ఓటరు బీఆర్ఎస్‌కేవీ వైపే..

పెద్దకందుకూరులోని పీఈఎల్ కంపెనీ

యాదగిరిగుట్ట, మార్చి 28 : మండలంలోని పెద్దకందుకూరు పీఈఎల్ కంపెనీ యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో బీఆర్ఎస్‌కేవీ గెలుపు లాంఛనమేనని కార్మికుల్లో చర్చ నడుస్తుంది. గత రెండు వేతన ఒప్పందాల్లో బీఆర్ఎస్‌కేవీ చేసిన కృషికి కార్మికుల్లో నమ్మకం పెరుగడంతో మరోసారి గుర్తింపు సంఘంగా బీఆర్ఎస్‌కేవీకి పట్టం కడితే మరింత లాభం చేకూరే అవకాశం ఉందని భావిస్తున్నారు. బలమైన కార్మిక సంఘం బీఎంఎస్ సైతం బీఆర్ఎస్‌కేవీకి మద్దతుగా నిలిచింది. కంపెనీలో 390 మంది కార్మిక ఓటర్లు ఉండగా, అందులో బీఆర్ఎస్‌కేవీకి 233 మంది బలం ఉన్నట్లు ఆ సంఘం నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇతర కార్మిక సంఘాల మద్దతుతో సీఐటీయూ 157 మంది కార్మికుల మద్దతుకే పరిమితమైందని పేర్కొంటున్నారు. అత్యధిక కార్మికుల మద్దతుతో బరిలో నిలిచిన బీఆర్ఎస్‌కేవీ మరో 20 మంది ఇతర కార్మికుల మద్దతును కూడగట్టింది. దీంతో బీఎంఎస్ బలపర్చిన బీఆర్ఎస్‌కేవీ గెలుపు దాదాపుగా ఖరారైంది. శనివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఎన్నికలు జరుగనున్నాయి. సాయంత్రం ఫలితాలు వెలువడనున్నాయి.

కార్మికుల్లో బీఆర్ఎస్‌కేవీపై పెరిగిన నమ్మకం

బీఆర్ఎస్‌కేవీ కార్మిక సంఘం గత రెండు దఫాలుగా జరిగిన గుర్తింపు ఎన్నికల్లో గెలుపొంది కార్మికులకు అండగా నిలిచింది. 10, 11 వేతన ఒప్పందాల్లో బీఆర్ఎస్‌కేవీ అధ్యక్షుడు గొంగిడి మహేందర్‌రెడ్డి కంపెనీ యజమాన్యంతో సంప్రదింపులు జరిపి కార్మికులు మెచ్చే వేతన ఒప్పందాలు అమలు చేశారు. 10, 11వ వేతన ఒప్పందాల్లో రూ.11,517 వరకు కార్మికుల జీతభత్యాలను పెంచారు. ట్రైనీ కార్మికులకు రూ.12వేల వరకు వేతనం యాజమాన్యాన్ని ఒప్పించి జూనియర్ కార్మికులకు అగ్రిమెంట్‌ను వర్తింపజేయడంతో పాటు ఏరియల్స్‌ను సాధించారు. ఫెస్టివల్ అడ్వాన్స్ గతంలో రూ.1,500 ఉండగా దానిని రూ.6,500 వరకు పెంచేలా బీఆర్ఎస్‌కేవీ కృషి చేసింది. కంపెనీ ప్రమాదంలో మృతిచెందిన కార్మికుడి కుటుంబానికి రూ.35 లక్షల పరిహారంతోపాటు కుటుంబానికి రెండు ఉద్యోగాలను ఇప్పించింది. కరోనా లాక్‌డౌన్ సమయంలో కార్మికులందరికీ 75శాతం వేతనాన్ని కల్పించింది. 8మంది కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా నియమించేలా కృషి చేసింది. ఇటీవల కంపెనీలో జరిగిన పేలుడు ఘటనలో మృతిచెందిన కార్మికుడు కనకయ్య కుటుంబానికి రూ.60 లక్షల పరిహారంతోపాటు ఒక ఉద్యోగాన్ని సాధించింది. ఆరేండ్లుగా పెండింగ్‌లో ఉన్న వీడీఏ పాయింట్ అమౌంట్‌ను రూ.8.50 నుంచి రూ.8.80 వరకు పెంచింది. 20 ఏండ్లుగా పెరుగని ఎల్‌టీఏ అమౌంట్‌ను గ్రేడ్ - 1, 2కు రూ.759 నుంచి 2,750 వరకు, గ్రేడ్ 3, 4కు రూ.వెయ్యి నుంచి రూ.3,250 వరకు, సిబ్బందికి రూ.1,200 నుంచి రూ.3,750 వరకు పెంచిన ఘనత బీఆర్ఎస్‌కేవీకే దక్కింది. ఈ క్రమంలో శనివారం జరుగబోయే గుర్తింపు ఎన్నికల్లో బీఆర్ఎస్‌కేవీని మరోసారి గెలిపించాలని కార్మికులు సిద్ధమయ్యారు.

12వ వేతన ఒప్పందాన్ని సాధిస్తాం

ప్రతి కార్మికుడికి ఇప్పుడున్న వేతనంతో కలుపుకొని రూ.18వేల వరకు వేతన ఒప్పందాన్ని సాధిస్తాం. స్టాఫ్ కార్మికులకు అదనంగా రూ.600 పెంచుతాం. పీఎఫ్ సీలింగ్‌ను ఎత్తివేస్తాం. వీడీఏ పాయింట్ రేటును పెంచుతాం. ఈఎస్ఐ పరిధి దాటిన ప్రతి కార్మిక కుటుంబానికి ఏడాదికి రూ.7లక్షల వరకు వైద్య బీమా పాలసీని పూర్తిగా యాజమాన్యమే భరించేలా కృషి చేస్తాం. ప్రమాదవశాత్తు మృతిచెందిన కార్మిక కుటుంబాలకు వెంటనే ఒకరికి ఉద్యోగ భద్రత, లేకుంటే మంచి ప్యాకేజీ అమౌంట్ ఇప్పిస్తాం. అర్హులైన కార్మికులందరికీ ప్రమోషన్లు, వీడీఏ పాయింట్ ప్రస్తుతం ఉన్న రేటు కంటే రూ.2నుంచి రూ.3వరకు పెంచుతాం. ప్రతి కార్మికుడికి ప్రస్తుతం ఉన్న ఎల్‌టీఏ అమౌంట్ కంటే రెట్టింపు ఏటీఏ ఇప్పిస్తాం. ఫెస్టివల్ సెలవులు, ఎస్ఎల్, సీఎల్ సెలవులను పెంచుతాం. సీనియర్, జూనియర్ల సమన్వయంతో సమన్యాయ వేతన ఒప్పందాన్ని సాధిస్తాం. స్టాఫ్, వర్కర్స్ రిటైర్డ్‌మెంట్‌కు ఒక నెల వేతనాన్ని గిఫ్ట్‌గా అందజేస్తాం. రిటైర్డ్‌మెంట్ నెల మధ్యలో ఉంటే ఆ నెల మొత్తం జీతాన్ని ఇప్పిస్తాం. మృతిచెందిన కార్మికుల అంత్యక్రియల ఖర్చుకు రూ. 50వేల వరకు ఇప్పిస్తాం. మహిళా కార్మికులకు పూర్తి ఉద్యోగ భద్రత కల్పిచడంతోపాటు మెరుగైన సౌకర్యాలను కల్పిస్తాం. కార్మికులంతా ఒక్కటై బీఎంఎస్ బలపర్చిన బీఆర్ఎస్‌కేవీ బాణం గుర్తుకు ఓటేసి అధిక మెజార్టీతో గెలిపించాలి.

– గొంగిడి మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్‌కేవీ పీఈఎల్ విభాగం అధ్యక్షుడు

1నుంచి రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి

భువనగిరి కలెక్టరేట్, మార్చి 28 : రేషన్ కార్డుదారులకు ఏప్రిల్ ఒకటి నుంచి సన్న బియ్యం పంపిణీ చేస్తామని, ఈ మేరకు జిల్లా పౌరసరఫరాల అధికారులకు ఉత్తర్వులు జారీ చేశామని రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ నుంచి రేషన్ షాపుల్లో సన్న బియ్యం మాత్రమే పంపిణీ చేసేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందని పేర్కొన్నారు. జిల్లాలో 2,03,193 ఆహార భద్రత కార్డులు ఉండగా, వాటిల్లో 6,37,964 మంది లబ్ధిదారులు ఉన్నారని తెలిపారు. 13,711 అంత్యోదయ కార్డుల్లో 38,224 మంది లబ్ధిదారులు ఉన్నారని పేర్కొన్నారు. మొత్తం 6,76,188 మంది లబ్ధిదారులకు ఏప్రిల్ నెల పంపిణీ చేసేందుకు 4,307.669 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం కేటాయింపు చేసినట్లు తెలిపారు.

6న సీతారామచంద్రస్వామి కల్యాణం

యాదగిరిగుట్ట, మార్చి 28 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి అనుబంధ పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఏప్రిల్ 5నుంచి 9వరకు సీతారామచంద్రస్వామి నవరాత్రోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ భాస్కర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5న రాత్రి 8గంటలకు ఎదుర్కోలు, 6న మధ్యాహ్నం 12 గంటలకు సీతారామచంద్ర స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 7న మధ్యాహ్నం 12:30 గంటలకు స్వామివారి పట్టాభిషేక మహోత్సవం ఉంటుందని తెలిపారు. ఉత్సవాల సందర్భంగా నిత్య రుద్రహోమం, చండీ హోమాలు, ఆర్జిత సేవలను తాత్కాలింగా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

మోత్కూరు, మార్చి 28 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లు యాదగిరి డిమాండ్ చేశారు. పేదలకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం తాసీల్దార్ ఉపేందర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ కాంగ్రెస్ అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించిందన్నారు. బునాదిగాని కాల్వ పనులను సత్వరమే పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, నాయకులు రాచకొండ రాములమ్మ, దడిపల్లి ప్రభాకర్, పైళ్ల రాంరెడ్డి, యాదయ్య, అంజయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

యాదయ్య (ఫైల్)

చౌటుప్పల్ రూరల్, మార్చి 28 : మండలంలోని తూఫ్రాన్‌పేట గ్రామ పరిధిలో జాతీయ రహదారి 65పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జలాల్‌పురం గ్రామానికి చెందిన గుండ్ల యాదయ్య(70) రంగారెడ్డి జిల్లా మంచాల మండలం లోయపల్లి గ్రామంలోని తన కూతురు ఇంటికి వెళ్లి టీవీఎస్ ఎక్స్ఎల్‌పై వస్తుండగా తూఫ్రాన్‌పేట వద్ద హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యాదయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని చౌటుప్పల్ పోలీసులు తెలిపారు.

'నిరుద్యోగులకు రుణాలు అందించాలి'

బొమ్మలరామారం, మార్చి 28 : నిరుద్యోగులకు సబ్సిడీతో కూడిన బ్యాంకు రుణాలు అందించాలని సీపీఐ మండల కార్యదర్శి అన్నెమైన వెంకటేశ్ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజీవ్ యువ వికాసం రుణాలు, సంక్షేమ పథకాలను అర్హులకు అందించాలన్నారు. నాయకులు పల్లపు మల్లేశ్, తుమ్మల జయమ్మ, పల్లపు రామకృష్ణ, లక్ష్మి, నరేశ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీపీఐ మండల కార్యదర్శి వెంకటేశం

ప్రజా సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు

మహాధర్నాలో మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు

రామన్నపేట, మార్చి 28 : ప్రజల సమస్యలు పరిష్కారమయ్యేదాకా సీపీఎం పోరాటం ఆగదని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు అన్నారు. సీపీఎం ప్రజా చైతన్య పాదయాత్ర ముగింపులో భాగంగా శుక్రవారం తాసీల్దార్ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామన్నపేట గతంలో నియోజకవర్గంగా, తాలూకా కేంద్రంగా విలసిల్లి ఇప్పుడు మండలానికి పరిమితమై అభివృద్ధికి ఆమడదూరంలో ఉందన్నారు. నియోజకవర్గాల పున్నర్విభజనలో తిరిగి నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ దవాఖానను వంద పడకలకు మార్చాలన్నారు. పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వలు పూర్తికావడం లేదని, గ్రామాలకు సరైన బస్సు సౌకర్యం లేదని తెలిపారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. లేకుంటే కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

మండలంలోని సిరిపురం గ్రామంలో సీపీఎం చేపట్టిన పాదయాత్రలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక వాగ్దానాలు చేసి అమలు చేయడంలో విఫలమైందన్నారు. అర్హులైన పేదలకు రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి, నాయకులు జెల్లెల పెంటయ్య, బొడ్డుపల్లి వెంకటేశం, బోయిని ఆనంద్, కందుల హనుమంతు, గన్నెబోయిన విజయభాస్కర్, బొడిగె రజిత, వేముల సైదులు, గణేశ్, అంజమ్మ, రాము, ఉపేందర్, అంజయ్య పాల్గొన్నారు.

ముస్లింలను నిర్లక్ష్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ విభాగం జిల్లా నాయకుడు ఎండీ ఇస్మాయిల్

సమావేశంలో మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు

భువనగిరి అర్బన్, మార్చి 28 : కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 15 నెలల్లో నియోజకవర్గంలోని ముస్లింలకు ఇఫ్తార్ విందు తప్ప వచ్చిందేమీలేదని బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ విభాగం జిల్లా నాయకుడు ఎండీ ఇస్మాయిల్ అన్నారు. పట్టణంలోని రహదారి బంగ్లాలో మైనార్టీ నాయకులతో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముస్లింలకు ప్రభుత్వం నుంచి ఏ పథకాలూ అందించలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేస్తూ ఆర్భాటాలు చేసుకున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పట్టణ పరిధిలో కోటి రూపాయలతో ఈద్గా నిర్మాణానికి భూమి పూజ చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం దాని గురించి పట్టించేకోవడం లేదని అన్నారు. ముస్లిం శ్మశాన వాటికకు రెండెకరాలు కేటాయించి హైమాక్స్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ భూమిలో అన్ని వసతులతో కూడిన షాదిఖానా నిర్మాణం చేయించాలన్నారు. పట్టణంలో వక్ఫ్‌బోర్డు భూములను కబ్జా చేసి విక్రయాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ విభాగం నాయకులు ఎండీ అంజద్, ఎండీ ముతహార్, మసూద్, రహీం, ఎండీ బురాన్, బబ్లూ పాల్గొన్నారు.

వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి

- మున్సిపల్ కార్యాలయం వద్ద సీపీఎం ధర్నా

మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

చౌటుప్పల్, మార్చి 28 : మున్సిపాలిటీలోని వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మంచినీటి సమస్యను పరిష్కరించాలని, ఇంటి పన్నులు తగ్గించాలని అన్నారు. తోపుడు బండ్ల వ్యాపారులకు ప్రత్యేక మార్కెట్ ఏర్పాటు చేయాలని, స్థానిక పెద్ద చెరువును, నాగులకుంటను సుందరీకరణ చేపట్టాలని కోరారు. అసంపూర్తిగా ఉన్న ఇండోర్ స్టేడియాన్ని పూర్తి చేయాలని, శ్మశాన వాటికలను నిర్మించాలని అన్నారు. గాంధీ పార్కును అభివృద్ధి చేయాలని, సర్వీస్ రోడ్డు వెంట అండర్ గ్రౌండ్ డ్రైనేజీని పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కోమటిరెడ్డి నర్సింహారెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గోశిక కరుణాకర్, నాయకులు బూర్గు కృష్ణారెడ్డి, ఎండీ పాషా, రామేశ్వరి, కిష్టయ్య, నర్సింహ, దాసు, ధర్మయ్య, అరుణ్‌కుమార్, లక్ష్మణ్, శ్రీనివాస్, ఆనంద్, మల్లేశం, అంజిరెడ్డి, ఐలయ్య, శ్రీనివాస్‌రెడ్డి, కె.శివ, ధర్మారెడ్డి, దశరథ, కృష్ణ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

సంస్థాన్ నారాయణపురం, మార్చి 28 : మండల కేంద్రానికి చెందిన ఒంటరి వృద్ధురాలు దాశవ్వకు అండగా ఉంటానని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు శివరాత్రి విద్యాసాగర్ అన్నారు. 8నెలల నుంచి ఆసరా పింఛన్ అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్న దాశవ్వకు శుక్రవారం రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. బీఆర్ఎస్ శాఖ అధ్యక్షుడు తెలంగాణ భిక్షం, నాయకులు ఎడ్ల సత్తయ్య, శ్రీను, వెంకటేశ్, శంకర్, నర్సింహ, శ్రీకాంత్, సాయికిరణ్ పాల్గొన్నారు.

ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

ఇఫ్తార్ విందు సందర్భంగా ప్రార్థనలో పాల్గొన్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి అర్బన్, మార్చి 28 : పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లింలకు ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మతసామరస్యానికి ప్రతీక అని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మైనార్టీ